క్లుప్తంగా

ముగిసిన చందనం అరగదీత



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం : సింహగిరిపై రెండో విడత చందనం అరగదీత శుక్రవారంతో ముగిసింది. ఈనెల 12న వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చి చందనాన్ని (సుమారు 125కిలోలు) సమకూర్చేందుకు ఈనెల 7వతేదీ నుంచి అరగదీత ప్రారంభించిన విషయం తెలిసిందే. మూడురోజుల్లోనే మొత్తం కావాల్సిన చందనాన్ని సిబ్బంది అరగదీశారు. ఈనెల 12న చందనాన్ని స్వామికి సమర్పిస్తారు.

నేడు శోభాహైమావతి రాక

పరవాడ: అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ పరిశీలకులు, మాజీ శాసనసభ్యులు శోభ హైమావతి శనివారం ఉదయం 8.30 గంటలకు సబ్బవరం పార్టీ కార్యాలయానికి రానున్నారని పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి పార్టీ ముఖ్య నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని మండల పార్టీ అధ్యక్షుడు రామారావు పిలుపునిచ్చారు.

నేటి నుంచి శారదాపీఠంలో హనుమద్ మహాయాగం

- దేశ రక్షణ కోసం 13 రోజుల పాటు క్రతువు

పెందుర్తి: భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో భారతదేశ రక్షణ కోసం, ఆర్మీ విజయం కోసం వజ్రని స్కంధ పాశుపత హనుమద్ మహాయాగం నిర్వహించనున్నట్లు శారదాపీఠం పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి మే 22న జరిగే హనుమద్ జయంతి వరకు 13 రోజుల పాటు ఈ క్రతువు జరుగుతుందని చెప్పారు. ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటలకు యాగాన్ని నిర్వహిస్తామని 22న పూర్ణాహుతితో యాగం ముగుస్తుందని చెప్పారు. శత్రు దేశంపై భారత సైన్యం విజయం సాధించాలని ఆకాంక్షతో ఈ క్రతువు తలపెట్టామని పేర్కొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఏడుగురికి కోర్టు రూ.70వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పై విధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేంపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ఉపాధిహామీ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

పెందుర్తి: ఉపాధి హామీ కూలీలకు కూటమి ప్రభుత్వం సక్రమంగా వేతనాలు ఇవ్వడంలో విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ విమర్శించారు. తక్షణమే కూలీల వేతన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం గొరపల్లి పంచాయతీ కరకవానిపాలెంలో ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఉపాధి కూలీల కనీస వేతనం రూ.600, పనిదినాలు 200 చేయాలన్నారు. పని ప్రదేశాల్లో ఎటువంటి జాగ్రత్తలు, సదుపాయాలు కల్పించడం లేదని మండిపడ్డారు. వారం వారం రావాల్సిన వేతనాలు గత 45 రోజులుగా రాకపోవడం దారుణమన్నారు. తక్షణమే బకాయిలన్ని విడుదల చేయాలని లేకపోతే ఉపాధి కూలీల పక్షాన పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్.పద్మ, నాయకులు, ఉపాధి హామీ కూలీల మేట్లు పాల్గొన్నారు.



గొల్లలపాలెంలోని రాయపురాజు చెరువులో మట్టిని తరలించేందుకు తొలగించిన చెరువు గట్టు

చెరువులు కనుమరుగు



అభివృద్ధికి నోచుకోని గొటివాడలోని సూరపురాజు చెరువు

- యథేచ్ఛగా చెరువుల ఆక్రమణ
- ప్రశ్నార్థకంగా మారుతున్న సాగు
- ఆందోళనలో రైతులు

సబ్బవరం: సబ్బవరం మండలంలోని సాగునీటి చెరువులు వ్యవసాయానికి జీవనాధారం. ఇక్కడి రైతులు పూర్తిగా వర్షాధారిత సాగుపైనే ఆధారపడతారు. వర్షాకాలంలో కురిసే సమృద్ధి వర్షాలతో నిండిన ఈ చెరువులే పంటలకు నీటిని అందించి రైతులకు భరోసా కలిగిస్తాయి. వర్షాలు ఆలస్యమైతే రైతులు నష్టపోక తప్పదు. మండలంలో దాదాపు 230 సాగునీటి చెరువులు ఉండగా, వీటిలో 23 చెరువులు 100 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. మిగిలిన 207 చెరువులు 100 ఎకరాల లోపు విస్తీర్ణం కలిగి ఉన్నాయి. చాలా చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. కొన్ని ఆనవాళ్లూ కోల్పోయాయి. నానాటికీ తగ్గిపోతున్న సాగునీటి వనరులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అయ్యన్నపాలెంలోని భూదేవి చెరువు మండలంలోనే అతిపెద్దది. 137 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు ద్వారా అయ్యన్నపాలెం, మత్రిపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లోని సుమారు 371 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందుతోంది. గొల్లపాలెంలోని రాయపురాజు చెరువు దాదాపు 178.73 ఎకరాల్లో విస్తరించి ఉంది. గొల్లలపాలెం రెవెన్యూ పరిధిలో 78.73 ఎకరాలు, నంగినారపాడు రెవెన్యూ పరిధిలో 100 ఎకరాలు ఈ చెరువు పరిధిలోకి వస్తాయి. ఈ చెరువు కింద గొల్లలపాలెం, జగన్నాథపురం, అమ్మరపిన్నివానిపాలెం, పైడివాడ, ఇరువాడ, అమృతపురం, నంగినారపాడు, సూరెడ్డిపాలెం, పెందుర్తి మండలంలోని జర్రిపోతులపాలెం, నందవానిపాలెం, పరవాడ మండలంలోని నక్కవానిపాలెం గ్రామాలకు చెందిన సుమారు 1,000 ఎకరాల ఆయకట్టు రైతులు లబ్ధి పొందుతున్నారు. గతంలో ఈ చెరువులో 40 ఎకరాల వరకు ఆక్రమణలు ఉండగా, రైతులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు సర్వే చేసి, కందకం ఏర్పాటు చేసి తొలగించారు. అయినప్పటికీ, కొందరు మళ్లీ ఆక్రమణలకు పాల్పడి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని సాగు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, జీవీఎంసీకి దగ్గరగా ఉండటంతో రాత్రిపూట భారీ యంత్రాలతో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు.



సూరపురాజు చెరువులో నేరేడు చెట్ల నరికివేత

చెట్ల నరికివేత

ఇటీవల గొటివాడలోని సూరపురాజు చెరువులో 30 ఏళ్లకు పైబడిన నేరేడు, తెల్లమద్ది, తుమ్మ, యూకలిప్టస్ వంటి విలువైన చెట్లను అక్రమంగా నరికేశారు. దీనిపై ఆయకట్టు రైతులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్బవరం ప్రాంతంలో భూముల ధరలు ఎక్కువగా ఉండటంతో అక్రమార్కులకు వాగులు, వంకలు, చెరువులు అనే తేడా లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. మండలంలోని అనేక సాగునీటి చెరువుల పరిస్థితి ఇలాగే ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో చెరువుల వివరాలు

మండలంలో పంచాయతీలు	-24
సాగునీటి చెరువులు	-230
100 ఎకరాలపైన ఆయకట్టు కలిగిన చెరువులు	-23
100 ఎకరాలలోపు ఆయకట్టు కలిగిన చెరువులు	-207



రాయపుర అగ్రహారంలో చెరువును అభివృద్ధి చేస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధి పథకంలో..

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగునీటి చెరువుల్లో పూడికతీతకు ప్రాధాన్యతనిచ్చాయి. గత టీడీపీ ప్రభుత్వంలో కూడా ఉపాధి హామీ పథకంతో పాటు నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా చెరువుల్లో పూడికతీతకు ప్రణాళికలు రూపొందించారు. ఉపాధి కూలీలు చెరువుల్లో పూడిక తీసి గట్లు బలపరిచినప్పటికీ, లోపల మట్టిని దూరంగా తరలించడం సాధ్యం కాకపోవడంతో నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా యంత్రాల సహాయంతో మట్టిని గట్లకు వేసి చెరువులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, నీరు-చెట్టు పనులను నామినేషన్ పద్ధతిలో తమ కార్యకర్తలకు అప్పగించడంతో, వారు యంత్రాలతో చెరువులను తవ్వి మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, చేసిన పనులకు ప్రభుత్వం నిధులు చెల్లించడంతో వారికి రెట్టింపు లాభం వచ్చిందని అంటున్నారు.

కానరాని చిత్తశుద్ధి

ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేకపోవడంతో పనులు చేపట్టిన చెరువులకు ఎక్కడా సర్వే నిర్వహించి సరిహద్దులు నిర్ణయించలేదని రైతులు విమర్శిస్తున్నారు. అలాగే చెరువుల్లోని ఆక్రమణలను తొలగించే ప్రయత్నం కూడా జరగలేదని వారు అంటున్నారు. కొన్ని చోట్ల తొలగించే ప్రయత్నం చేసినా, అక్రమార్కులు అధికారులను అడ్డుకోవడం లేదా కోర్టులను ఆశ్రయించడంతో ఆయా చెరువుల అభివృద్ధి ఆగిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



గొల్లలపాలెంలోని మండలంలో రాయపురాజు చెరువు పెద్దది. ఈ చెరువులో గర్భంలో ఆక్రమణలపై గతంలో రెవెన్యూ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశాం. దీంతో గతంలో చెరువు సర్వే చేసి ట్రెంచ్ ఏర్పాటు చేసి ఆక్రమణలను తొలగించారు. తిరిగి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు.

-మోపాద అప్పారావు, గొల్లలపాలెం సర్పంచ్, సబ్బవరం మండలం

సర్వే చేసి చర్యలు తీసుకుంటాం

మండలంలోని సాగునీటి చెరువులు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల మండలానికి బదిలీపై వచ్చా. మండలంలోని అన్ని చెరువులను పరిశీలించాల్సి ఉంది. తరువాత ఆయా చెరువులకు సర్వే నిర్వహించి ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

-ఎస్.మోహన్‌రూప, ఇరిగేషన్ ఏఈ, సబ్బవరం మండలం

సమగ్ర విద్యతో మహిళా సాధికారత



బాలికలతో హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే పంచకర్ల, సంస్థ ఈడీ సమీర్‌శర్మ

పరవాడ: సమగ్ర విద్య ద్వారా మహిళా సాధికారత సాధ్యపడుతుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. దీపాంజలినగర్ శకుంతలం ఆడిటోరియంలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ విభాగం ఆధ్వర్యంలో బాలిక ఎంపవర్‌మెంట్ మిషన్-2025 కార్యక్రమాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జ్యోతి ప్రజ్వలన చేసి శుక్రవారం ప్రారంభించారు. సంస్థ పరిసర గ్రామాల పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసిన బాలికల కోసం ఎన్టీపీసీ సీఎస్ఆర్ విభాగం సౌజన్యంతో నిర్వహిస్తున్న నాలుగు వారాల వర్క్‌షాపును బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వర్క్‌షాపు ద్వారా 120 మంది బాలికలకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. నిర్వాసిత గ్రామాల బాలికల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని వారి కోసం ప్రత్యేకంగా వర్క్‌షాపును ఏర్పాటు చేసిన సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అభినందించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ మాట్లాడుతూ ఇక్కడ నాలుగు వారాల పాటు నిర్వహించే వర్క్‌షాపులో సాధికారత బాలికలకు కళలు, క్రీడలు, సంగీతం, కంప్యూటర్ అక్షరాస్యత, ఇంగ్లీష్, తెలుగు, గణితం, పర్యావరణ శాస్త్రాలలో తర్ఫీదు కల్పించడం జరుగుతుందన్నారు. బాలిక సాధికారతే లక్ష్యంగా సింహాద్రి ఎన్టీపీసీ కృషి చేస్తుందని ఈడీ సమీర్ శర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, సీఎస్ఆర్ అధికారులు, అధిక సంఖ్యలో బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ పి. సుభాషిణి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ బి. రాధిక శుక్రవారం తెలిపారు. ఈ పరీక్షలలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ ఒకేషనల్, జనరల్ విద్యార్థులు 99 మంది, ద్వితీయ సంవత్సరం నుంచిచ 34 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. ఈ పరీక్షలు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆయా రోజులలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షలకు సంబంధించిన తరగతి గదులు, తాగునీరు, వైద్య సదుపాయాలతో ప్రశాంత వాతావరణంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలి



తహసీల్దారు అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పరవాడ పాత్రికేయులు

- సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలపై మండిపడ్డ జర్నలిస్టులు

పరవాడ: కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని పరవాడలోని పలువురు పాత్రికేయులు మండిపడ్డారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయ రెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు జరపడంపై నిరసన తెలుపుతూ ఏపీడబ్ల్యూజేఎఫ్, పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ యూనిట్ ప్రతినిధులు తహసీల్దారు ఎస్వీ అంబేడ్కర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అవినీతి, అక్రమాలపై కథనాలు ప్రచురించినందుకు ఎడిటర్ ఇంట్లో సోదాలు జరపడం అన్యాయమని, ఇది పూర్తిగా పత్రికా స్వేచ్ఛను హరించడమేనని పాత్రికేయులు మండిపడ్డారు. ఇటువంటి చర్యలను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.కృష్ణారావు, పైల సన్యాసినాయుడు, గౌరవాధ్యక్షుడు పి. జగదీశ్వరరావు, కశిరెడ్డి రాజు, పైల అక్కునాయుడు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రెడ్డి గోపి, రెడ్డి శేఖర్, పైల రామారావు, వెందుల మోహనరావు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం



ఇటీవల పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి అనిత

పెందుర్తి: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పెందుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన మెగా జాబ్ మేళాలో 44 కంపెనీలు పాల్గొన్నాయి. 3020 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 826 మంది ఎంపికయ్యారు, తుది జాబితాలో 238 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని జాబ్ మేళాల ద్వారా ఉద్యోగ కల్పన జరుగుతుందని మంత్రి అనిత అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హరిందిర ప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు, జెడ్పీ హేమావతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం



వృద్ధులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెందుర్తి: బాల సురక్ష వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 200 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ విశ్రాంత ఇంజనీర్ గొర్లె రమణమూర్తి మాట్లాడుతూ అభాగ్యులుగా ఉన్న వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న లయోలా వృద్ధాశ్రమ నిర్వాకులు అభినందనీయులున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో నీలవేణి, బాల సురక్ష ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు సుగుణ, ఉపాధ్యక్షురాలు రేణుకాపాత్ర, కోశాధికారి నిర్మలానంద, డాక్టర్ సందేష్, డాక్టర్ శ్రీరమ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ తదితరులు

సబ్బవరం: త్వరలో జరగబోయే ఉపాధ్యాయుల బదిలీలు మాన్యువల్ పద్ధతిలో నిర్వహించాలని, ఏజెన్సీ ప్రాంతాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలని పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డి. గోపీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సబ్బవరంలోని విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం తమ యూనియన్ సభ్యులతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అదేవిధంగా రిటైర్మెంట్‌కు మూడేళ్లలోపు సర్వీస్ ఉన్నటువంటి ఉపాధ్యాయులను బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఉన్నత పాఠశాలలో 1:40 నిష్పత్తిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులను తప్పనిసరిగా నియమించాలన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌కు ప్రధానోపాధ్యాయులుగా సీనియర్ ఎస్‌జీటీలను పీఎస్‌హెచ్‌ఎంగా నియామకం చేయాలన్నారు. పెండింగ్ బకాయిలు సరెండర్ లీవ్, డీఏ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని, పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం మండల యూనియన్ ప్రధాన కార్యదర్శి వనం భాస్కరరావు, రాష్ట్ర యూని యన్ కార్యదర్శి అడిగర్ల సత్యంనాయుడు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కేవీ రమణ, మాడుగుల అధ్యక్షుడు ఆనంద్, జిల్లా కార్యదర్శి డెక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన వేంకటాద్రి బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



వేంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా ముగిశాయి. ఆఖరి రోజు శుక్రవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానం జరిపారు. సాయంత్రం దేశం, రాష్ట్రం నలుమూలల నుంచి రప్పించిన వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం జరిపారు. స్వామివారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవ జరిపారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణలతో మహా పూర్ణాహుతితో ఉత్సవాలు వేడుకగా ముగిశాయి. ఆలయ అర్చకుడు మహర్షి శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ఈవో నీలిమ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రజల సహకారం ముఖ్యం



మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణు స్వరూప్

పరవాడ: నేరాల నియంత్రణకు ప్రజల సహకారం ముఖ్యమని డీఎస్పీ విష్ణు స్వరూప్ అన్నారు. సంతబయలులో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలని, అపరిచితులకు ఇళ్లు అద్దెకు ఇవ్వొద్దని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పిల్లలను బెట్టింగ్ యాప్‌ల నుంచి కాపాడాలని, గంజాయికి దూరంగా ఉంచాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు షేర్ చేయొద్దని, మైనర్లు వాహనాలు నడపకుండా చూడాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని సర్పంచ్ అప్పలనాయుడు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.